అడల్ట్స్ ఓన్లీ కథ

# శృంగార పరిపూర్తి

ప్రొ. డి. కనకదుర్గ

ఆంధ్రభూమి దిన పత్రిక ఉగాది కథలపోటీలో ఎంపికైన రచన

''దీపూ'' ఆర్తిగా పిలిచాడు.

''ఊఁ...'' మత్తుగా పలికిందామె.

''దీపులూ'' ఇంకా లాలనగా పిలిచాడు.

''చెప్పు రాజా''

''నీకేమనిపిస్తోందిప్పుడు?''

''ఊఁ...మంచం చుట్టూ నువ్వు కట్టిన మల్లెపూలు ఇప్పుడే విరుస్తూ మత్తెక్కిస్తున్నాయి రాజా! దిండు మీద జల్లిన జాజులు గుబాళిస్తున్నాయి. నువ్వు ఎంతో మనసుపడి ప్రత్యేకంగా గుత్తిలా కట్టి మన దిళ్ల మధ్య పెట్టిన సంపెంగలు పిచ్చెక్కిస్తున్నాయి. ఇంకేం చెప్పను రాజా!'' మత్తుగా అంది దీప.

''ఇవాళ మన పెళ్లిరోజు డార్లింగ్. మన మొదటి రాత్రి గుర్తుందా? ఎంతో కన్‌ఫ్యూజన్‌లో గడిచింది. గది బయట మనుషులున్నారని నువ్వు బిడియపడుతుంటే నిన్నెలా పలకరించాలో తెలియక నేను తత్తరపడ్డాను''

సిగ్గుపడింది దీప.

''ఇంకా గుర్తుందా రాజా! అయినా మన సంప్రదాయాలు కొన్ని అస్సలు బాగాలేవు. అందరి మధ్య పెళ్లి కొడుకుని పెళ్లికూతుర్ని గదిలోకి తోస్తే ఎంత ఘోరంగా వుంటుంది చెప్పు. మర్నాడు పొద్దున్న ఎవర్నీ మొహమెత్తి చూడలేకపోయాను''

''ఇక మన మొదటి సంవత్సరం పెళ్లిరోజు అసలు బాగాలేదు కదా!''


''ఔను! పెద్దబాబు నెల పిల్లాడు. వాడికి మోషన్స్ ఆగక కంగారు పడ్డాం'' గలగలా నవ్వింది దీప.

''ఆ... ఇప్పుడు నవ్వుతున్నావు. ఆరోజు రాత్రంతా ఏడ్చావు. గుర్తుందా?''

''అటువంటి అనుభవాలు మర్చిపోతానా రాజా! మనం గడిపిన శృంగార రాత్రులు ఎంత గుర్తుంటాయో వాటిని పోగొట్టుకున్న రోజులు ముఖ్యంగా పిల్లల గురించి కంగారుపడిన క్షణాలు కూడా అంతే గుర్తుంటాయి''

''ఈ పెళ్లిరోజు ఎలా వుంది చెప్పు?''

''అబ్బ).. ఇంత ఆనందంగా ఎప్పుడూ లేనురా! చుట్టూరా గదుల్లో ఎవరూ లేకుండా, మెత్తని పువ్వులు పరిచిన పరుపు మీద నీ ఒళ్లో ఒరిగి, ఎంత బాగుంది! ఇప్పుడు దేవుడు కనపడి స్వర్గానికి రమ్మన్నా వెళ్లను''



''అంటే.. పూలమంచం, నేను లేకపోతే వెళ్లిపోతావా?''

''పూలమంచం సంగతేమో గానీ నువ్వు లేక

పోతే నేనుండను రాజా''

''నా రాణీ నేనూ అంతే. ఈ రాత్రంతా నువ్వు నేను ఇలాగే ఈ మంచం మీద గడపాలి''

''ఇప్పుడింకా టైము ఏడే సార్'' గడియారం కేసి చూసి అంది దీప.

''అవును. ఇంకా పన్నెండు గంటలు మనం ఇలాగే పెనవేసుకుని పడుకుని కబుర్లు చెప్పుకోవాలి. నువ్వు లేవద్దు. నన్ను లేపొద్దు''

''అందుకేగా బయట నుంచి తాళం పెట్టాను. మనం రేపొస్తామని పక్కింట్లో చెప్పాను కూడా''

''చాలా మంచి పని చేసావు. ఎన్నాళ్లయింది మనం ఇలా గడిపి''

''పిల్లలున్నప్పుడు ఎలారా? సిగ్గుగా వుంటుంది నాకు''

''అందుకే వాళ్లని అప్పుడప్పుడు ఇలా బయటికి పంపించేయాలి. ఇంక టైము వేస్ట్ చేయకు. మనకున్నది ఈ రాత్రి ఒకటే. మళ్లీ పొద్దున్న పిల్లలొచ్చేస్తారు'' దీపని నడుం దగ్గర చెయ్యి వేసి పైకి లాక్కున్నాడు తమకంగా.

ఆ రాత్రి ఇద్దరికీ శివరాత్రే అయింది. ప్రకృతి, పురుషుడు కలిసి చేసే ఆరాధన ప్రత్యేకమైన శైలిలో చేశారు దీప-రాజు. తనువుల సామీప్యం ఇచ్చే మత్తే కాదు, మనసులు మమేకమయ్యే మాధుర్యాన్ని, ఆత్మలు ఒక్కటయ్యే ఆనందాన్ని- అన్నిటినీ కలిపి ఆస్వాదించారు ఇద్దరూ. సంవత్సరాల తరబడి కష్టం, సుఖం ఒకే రకంగా పంచుకుని ఒకళ్ల తోటిదే ఇంకొకళ్ల లోకం అనుకుని బ్రతికిన స్త్రీ పురుషులకి మాత్రమే సాధ్యపడే అనిర్వచనీయమైన అనుభూతిని ఆత్మల సాక్షిగా అనుభవించారు.

★ ★ ★

''లక్ష్మమ్మగోరూ, పాల పాకెట్లిక్కడ పెట్టాను, తీసుకోండి'' గేటు దగ్గర్నించి అరిచిన పాలవాడి కేకకి మెళకువ వచ్చింది దీపాలక్ష్మికి.

రాత్రి అంతా మేలుకునే వుండడం గుర్తుంది. తెల్లవారుఝాముున నాలు గింటిదాకా తెలుసు. తర్వాత ఎప్పుడు నిద్ర పట్టిందో తెలీదు. పక్కకి తిరిగి చూసింది. రాజు గాఢ నిద్రలో వున్నాడు. మెల్లగా లేచి తన మీద వున్న అతని చేయిని నెమ్మదిగా పక్కకు పెట్టింది. మంచం దిగింది. గదంతా పూల పరిమళం నిండి వుంది. మెల్లగా వెళ్లి పక్కనే కుర్చీలో వున్న తన బట్టలు కట్టుకుంది. టైము ఏడుంబావు అయింది.

ముఖం కడుక్కుని స్నానం చేసింది.

'లిప్‌స్టిక్ లేదు కదా!' అని పరీక్షగా అద్దంలో చూసుకుంది.

వంటింట్లోకి వెళ్లి కాఫీ డికాక్షన్ చేసింది. రాత్రి వంట చేయలేదు కాబట్టి గిన్నెలేం లేవు కడగడానికి. ఆ పూటకి కూరేముందాని ఫ్రిజ్ తెరచి చూసింది. మంచి వంకాయలు కనపడ్డాయి. కారం వేయించింది గుత్తివంకాయ కూర చేద్దామని.

వంట పూర్తయ్యేసరికి తొమ్మిదైంది. బెడ్‌రూంలోకి వచ్చింది. అప్పుడే లేచిన రాజు నవ్వాడు దీపని చూసి. రెండు చేతులూ చాచాడు. వెళ్లి చేతుల్లో వాలిపోయింది. పదిహేను నిమిషాలు మళ్లీ ప్రపంచాన్ని మరచిపోయారు ఇద్దరూ.

''లేవండి, ముఖం కడుక్కుని కాఫీ తాగుదురు గానీ..''

''నువ్వు తాగావా?''

''ఉహూ.. ఇద్దరం కలిసి తాగుదాం. వంట కూడా అయిపోయింది. ఆకలి వేయటంలా? నిన్న కూడా ఏం తినలేదు''

''ఆకలి ఎప్పుడూ పొట్టకే వుంటుందా దీపూ? నా అయిదేళ్ల ఆకలి నిన్న రాత్రి తీరింది. ఇప్పుడు తృప్తిగా వుంది''

## ఊర్మిళ సలహాలు

**హిమేష్ రేషమియా కేవలం సంగీతకారుడిగానే కాకుండా నటుడిగా కూడా 'అప్కా సురూర్'తో పరిచయమయ్యాడు కదా! అతని కొత్త సినిమా 'కర్జ్'లో ఊర్మిళ కూడా నటిస్తోంది. నటనలో ఎంతయినా ఆమె సీనియర్ కదా! అందుకేనేమో ఈ సీన్లో ఇలా వుండాలి, ఇలా నటించాలి అంటూ హిమేష్‌కి తెగ సలహాలిచ్చేస్తోందిట ఊర్మిళ. వాటిని హిమేష్ కూడా పాటిస్తున్నాట్ట. మంచిదే కదా!**



''సరే.. త్వరగా లేవండి. గదంతా సర్దాలి. కోడలు, పిల్లలు వచ్చేస్తారు''

''అవును కదూ!'' లేచాడు రాజు.

కాఫీ తాగాక ఇద్దరూ బెడ్‌రూంలో పని మొదలుపెట్టారు. మంచం చుట్టూ కట్టిన పూలన్నీ మంచంమీద దుప్పటి మధ్యలో వేశారు. ఏ మూల ఏమీ లేకుండా పరుపుని దులిపేశారు. తమ దుప్పటిలో పూలు చుట్టుకుని, అది తీసేసి కుర్చీలో పెట్టి, అంతకు ముందున్న దుప్పటి వేశారు. దిండు కవర్లు కూడా ముందున్నవి వేసేశారు. పక్కనే చిన్న బల్లమీద పెట్టిన అగరుబత్తీలు తీసేశారు. గదిని మళ్లీ ముందు రోజు ఉన్నట్టు సర్దేశారు. దుప్పటిలో మూట కట్టిన పూలు తీసుకెళ్లి తమ బట్టలు పెట్టుకునే చిన్న స్టోరురూం అలమారులో పెట్టింది దీపాలక్ష్మి.

రాజశేఖర్ కూడా స్నానం చేశాక ఇద్దరూ కలిసి అన్నం తిన్నారు. తిన్నారనే కంటే, ఒకళ్లకి ఒకళ్లు తినిపించుకున్నారు. ఇద్దరూ భోజనం పూర్తి చేయడానికి గంట పట్టింది. హాల్లో తాము పడుకునే మంచాలు ఈ గోడకి ఒకటి, పక్క గోడకి ఒకటి ఉన్నాయి.

వాటి మీద నడుం వాల్చారు.

''నాన్నా, అమ్మా'' గోపీ గొంతు విని రాజశేఖరం లేచాడు మొదట. ''వస్తున్నా'' వెళ్లి తలుపు తీశాడు.


''తాతయ్యా'' మనవడు రాహుల్ వచ్చి పట్టుకున్నాడు.

''పెళ్లి బాగా అయిందా''

''అయింది నాన్నా! మీరిద్దరూ రాలేదని అత్తయ్యా మామయ్యా మరీ మరీ అడిగారు. మమ్మల్ని కూడా ఇంకా నాలుగు రోజులుండమన్నారు''

''ఉండవలసిందిరా పాపం!''

''నాకు సెలవు దొరకడం కష్టం కదా నాన్నా! మళ్లీ రాహుల్‌కి స్కూలు పోతుంది. పైగా మీకు ఒంట్లో బాగాలేదని పెళ్లికి రానన్నారు కదా! మిమ్మల్ని వదిలి ఎలా వుంటాం నాన్నా''




## భలే చాన్స్!

**ఇటీవలే జాతీయ స్థాయిలో ఉత్తమ నటిగా అవార్డు గెలుచుకున్న ప్రియమణికి శంకర్, మణిరత్నంల నుంచి గ్రీటింగ్స్ అందాయి. అది మామూలే కావచ్చు, కానీ శంకర్ 'రోబో' సినిమాలో ప్రియమణికి చాన్స్ రావచ్చు అనే టాక్ చెన్నయ్‌లో జోరుగా షికారు చేస్తోంది. ఇందులో నిజానిజాలు ఎలా వున్నా మణిరత్నం చిత్రంలో మాత్రం అవకాశం గ్యారంటీ అంటున్నారు ఆమె సన్నిహితులు. ఏదయితేనేం కామ్‌గా వుంటూ ఒక్కసారిగా వార్తల్లో తారైపోయింది ప్రియమణి.**



కొడుకు అభిమానానికి కళ్ల నీళ్లొచ్చాయి రాజశేఖరానికి. వాళ్ల మాటలకి లేచింది దీపాలక్ష్మి.

''ఏరా ఎప్పుడొచ్చారు?''

''ఇప్పుడే అమ్మా! నీకెలాగుంది? నీరసం తగ్గిందా?''

నవ్వింది దీపాలక్ష్మి. చిన్నప్పటి తల్లి కనబడింది చంద్రానికి తల్లి నవ్వితే. ఆమె మొహంలో ఏదో వింత వెలుగు కనపడింది కోడలికి.

★ ★ ★

''అమ్మా నాన్నా మీతో ఒక ముఖ్యమైన విషయం చెప్పాలి. ఇటు రండి''

''ఏమిట్రా?'' వంటింట్లోంచి దీపాలక్ష్మి, వరండాలోంచి రాజశేఖరం హాల్లోకి వచ్చారు.

''అమ్మా! ఈ ఇల్లంటే మీకెంత ప్రాణమో నాకు తెలుసు. కానీ మనం ఖాళీ చేసి వేరే వెళ్లాలి. నాకు ఆఫీస్ క్వార్టర్ అలాట్ చేసారు. ఇవాళే అంతా శుభ్రం చేయించి వస్తున్నాను. రేపు మంచి రోజుట, మారిపోదాం''

''బాబూ.. మీ నాన్న సంపాదనలో మిగిల్చిన ఆస్తి ఇదే నాయనా! చిన్న ఇల్లయినా ఎంతో మందికి నీడనిచ్చింది! మీ తాత, మామ్మ ఇక్కడే ఉన్నారు. మీ మేనత్త, భర్త ఆరేళ్లు ఇక్కడున్నారు. వాళ్ల ఆస్తి తగాదాలు తీరాక వెళ్లారు. నీ పెళ్లవక ముందు అన్నయ్య, వదిన వున్నారు. నీకు తెలుసు. ఇప్పుడు సొంత ఇల్లు వదలి రావాలంటే ఎలారా? మా జీవితం మూడొంతులు ఇక్కడ గడిచింది''

''మరెలా అమ్మా! క్వార్టర్‌లో వుంటే కొన్ని అడ్వాన్టేజెస్ వున్నాయి''

''సరే నాన్నా! మీరెళ్లి వుండండి. నేనూ అమ్మా ఇక్కడుంటాం''

''అయ్యో! ఈ వయసులో మిమ్మల్ని వదిలిపెట్టి వెళ్లమంటారా?'' కోడలు లలిత నొచ్చుకుంది.


''ఏం పర్వాలేదు లలితా! శనివారం ఇక్కడికి వచ్చేయండి. సోమవారం వెళదురుగానీ'' చిరునవ్వుతో అంది దీపాలక్ష్మి, ఇద్దరు కోడళ్లకి అత్తగారు, నలుగురు మనవలకి నాయనమ్మ.

''అంతే అంటావా అమ్మా!'' నిస్పృహాయంగా అన్నాడు గోపాలకృష్ణ. కొడుకు భుజం తట్టాడు ప్రేమగా రాజశేఖరం.

★ ★ ★

''మనం వాళ్లని వదలి రావడం నాకెంతో బాధగా వుంది గోపీ'' క్వార్టరుకి వచ్చిన మర్నాడు అంది లలిత.

''పిచ్చి లలితా! నువ్వు ఒకే వైపు నుంచి ఆలోచిస్తున్నావు. అమ్మానాన్నలని ప్రేమగా చూసుకున్నామే కానీ, ఇన్నాళ్లూ వాళ్ల నిజమైన అవసరాల గురించి ఆలోచించలేదు మనం. వాళ్లిద్దరికీ కూడా మనలాగే ప్రైవసీ కావాలని గుర్తించామా? నా చిన్నప్పటి నుంచీ చూస్తున్నాను. అమ్మానాన్నని ఆ ఇంట్లో. పాపం నాన్నగారు మేం ముగ్గురం పెద్దయ్యే లోపల అప్పు తీరాలని లోను తీసుకుని ఆ ఇల్లు కట్టారు అతి కష్టం మీద. ఒక హాలు, ఒకే బెడ్‌రూం, వరండా, వంటిల్లు, ఆ చిన్న స్టోర్‌రూం. ఇల్లయిన కొత్తల్లో మా తాతయ్యకి వంట్లో బాగాలేదని డిస్టర్బెన్స్ అవకూడదనీ మా తాతయ్యకి నాయనమ్మకి ఆ బెడ్‌రూం ఇచ్చారు. ఏడేళ్లకి తాతయ్య పోయిన తర్వాత అమ్మానాన్న ఆ గదిలో పడుకునే వారు. నాయనమ్మ హాల్లో పడుకునేది. ఏడాది తిరక్కుండా మా మేనత్త, ఆవిడ భర్త వాళ్ల




కుటుంబ కలహాలతో విడిపడి ఇక్కడికి వచ్చేశారు. అప్పుడు వాళ్లకి ఆ రూం ఇచ్చి, అమ్మానాన్న హాల్లో పడుకునేవారు. వాళ్లు ఐదేళ్లపైనే వున్నారు. తర్వాత రెండేళ్లకే అన్నయ్య పెళ్లవడంతో బెడ్‌రూం మళ్లీ అన్నావదినలకి దత్తమైపోయింది. అన్నయ్యకి ట్రాన్స్‌ఫరై వెళ్లిన రెండు నెలలకే మన పెళ్లవడం, మనకి ఆ రూం ఇవ్వడం జరిగింది. ఈ రకంగా అమ్మానాన్నలకి ఏళ్ల తరబడి ప్రైవసీ లేకుండానే అయింది లలితా! అమ్మానాన్నలిద్దరూ బాధ్యతాయుతమైన మనుషులవడం, మాది మధ్యతరగతి కుటుంబం కావడం తప్ప ఇందులో ఎవరి తప్పూ లేదు'' బాధగా అన్నాడు గోపాలకృష్ణ.

''పాపం వాళ్ల జీవితమంతా త్యాగాలతోనే జరిగిపోయింది. మరి ఈ అయిదేళ్లు మీకు ఈ ఆలోచన రాలేదా?''

''నిజంగా రాలేదు లలితా! ఏదో నా జీతంలో వచ్చే హౌస్ రెంట్ అలవెన్స్ మిగులుతుందని అనుకున్నానే కానీ ఈ రకంగా ఆలోచించలేదు. మనం రాగానే రూంలోని పరిమళం నాకు ఆశ్చర్యమనిపించింది. నిన్న అమ్మా నాన్న పక్కింటి ఆయన షష్టిపూర్తికి వెళ్లారు చూడు, అప్పుడు స్టోర్‌రూంలో ఏదో అవసరమై వెతుకుతుంటే అమ్మావాళ్ల దుప్పటిలో చుట్టచుట్టి ఎండిపోయినవి ఒక రాసెడు పూలు కనిపించాయి. మొదట నాకూ అర్థం కాలేదు. తర్వాత అర్థమైంది. వాళ్లకి దొరికిన ఒక్క రోజూ వాళ్లు ఆనందంగా గడిపి వుంటారని. అందుకే ఈ ఏర్పాటు చేశాను''

''తల్లిదండ్రుల గురించి ఇంత ఆలోచించే వాళ్లు ఎంతమంది దొరుకుతారు గోపీ?'' మెచ్చుకోలుగా అంది లలిత.

''ఈరోజుల్లో పిల్లలు తల్లిదండ్రులకి మరీ దూరమైపోతున్నారు లలితా! వేరే రాష్ట్రాల్లో వున్నవాళ్లు, ఇక విదేశాల్లో ఉన్న వాళ్లయితే వీళ్లని తమ దగ్గర అట్టేపెట్టుకోవడానికి కూడా ఇష్టపడడంలేదు. ఇక ఊళ్లో వున్నవాళ్లు వాళ్లని తమ అవసరాలకి మాత్రం వాడుకుంటున్నారు. వాళ్లు ఉద్యోగాలకి వెళితే వాళ్ల పిల్లలని చూడడానికో వంట చెయ్యడానికో ఉపయోగించుకుంటున్నారు. జీవితమంతా కష్టపడిన తల్లిదండ్రులకి పిల్లల నుంచి ప్రేమతో పాటు వాళ్ల ప్రైవసీ, ఇండిపెండెన్స్, లీజరు వాళ్లకి కావాలి. మనం వాళ్లని వదిలెయ్యటం లేదు. వాళ్ల అవసరాలు చూస్తూనే వాళ్లని ఆనందంగా వుంచుదాం. వారానికి ఒకటి రెండు రోజులు ఎవరైనా వచ్చినా మనం వెళ్లినా కనీసం మిగతా రోజుల్లో వాళ్లు హాయిగా వుంటారు కదా!''

''చాలా మంచి పని చేసావు గోపీ! పాపం మామగారికి యాభై ఎనిమిది, అత్తగారికి యాభై మూడేళ్లు వచ్చాయి. ఈ సమయంలోనైనా వాళ్లని ఏకాంతంగా ఆనందంగా ఉండనీయండి''

''ఎక్కడో పుస్తకంలో చదివాను లలితా, శృంగారం చిన్నవాళ్లకే కాదు, పెద్దవాళ్లు, ముసలివాళ్లకి కూడా అవసరమేనట. సెక్స్ సామర్థ్యం తగ్గినకొద్దీ ఈ అవసరం పెరుగుతుందట. ఆ పుస్తకం పేరు మిరాజెస్ ఆఫ్ మ్యారేజి. అందులోనే ఓ ముసలి దంపతుల ఇంటర్‌వ్యూ వుంది. ఆవిడకి 70 ఏళ్లు, ఆయనకి 80 ఏళ్లు- వాళ్లేం చెప్పారో తెలుసా? 'సెక్స్ జీవితం గడిపినప్పుడు రెండు నిమిషాలు సెక్స్ అనుభవించేవాళ్లం. ఇప్పుడు రాత్రంతా ఒకళ్లని ఒకళ్లు పట్టుకుని పడుకోవడంతో పది గంటల సెక్స్ అనుభవిస్తున్నాం' అని అన్నారట. నాకు ఆశ్చర్యమేసింది'' గోపీ వివరించాడు.


''అయితే అదే శృంగార పరిపూర్తి అన్నమాట''

''అన్నమాటేమిటి, ఉన్నమాటే. మనకి కూడా ఈ ప్రైవసీ ఎంత బాగుంది? పిల్లలు స్కూలుకెళ్లిపోయాక గంటసేపు ఒకళ్ల కౌగిలిలో ఒకళ్లు వుండడం'' చిలిపిగా అన్నాడు గోపీ.

''నిజమే!'' అంగీకరించింది అర్ధాంగి. ''మనం కూడా అక్కడికి వెళ్లినా రాత్రి భోజనాలు కాగానే వచ్చేద్దాం గోపీ, ఇక వాళ్లని వేరుచేసే పాపం మనకి వద్దు'' మనస్ఫూర్తిగా అంది లలిత.

''థాంక్యూ డార్లింగ్. ఇలాంటి అర్ధాంగి ఉన్నాక ఎవరికైనా లోటేమిటోయ్'' దగ్గరికి జరిగాడు గోపీ ఆనందంగా.

☆



## టైమ్ బాగుంది

**కత్రినా కైఫ్ వరసగా నాలుగు హిట్ సినిమాలతో బాలీవుడ్‌లో క్రేజీ స్టారైపోయింది ప్పుడు. దీంతో ఆమె కాల్షీట్ల కోసం ఎగబడే నిర్మాతలకి డేట్లు అడ్జస్ట్ చేయలేక సతమతమవుతోందిట కత్రినా. అదలా వుంటే- కత్రినాకి జాన్ అబ్రహాంని జోడీ చేసి ఓ సినిమా తీయబోతున్నాడు దర్శకుడు కబీర్ ఖాన్. దీంతో హాటెస్ట్ పెయిర్‌గా ఈ జంటకి అప్పుడే క్రేజ్ పెరిగిపోయింది. ఆమధ్య 'కాబూల్ ఎక్స్‌ప్రెస్' సినిమా తీసిన కబీర్ ఇప్పుడీ సినిమా తీస్తున్నాడు. ఏమైనా ప్రస్తుతం కత్రినా టైమ్ బ్రహ్మాండంగా వుంది మరి!**